క్లుప్తంగా

నేరాల నియంత్రణే లక్ష్యంగా కార్డన్ సెర్చ్



వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న సీఐ బాబి, ఎస్ఐలు

నాయుడుపేట టౌన్ : శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణే లక్ష్యంగా తనిఖీలు చేస్తున్నట్లు నాయుడుపేట అర్బన్ సీఐ బాబి తెలిపారు. ఆయన ఆదివారం తెల్లవారుజామున ఎస్ఐలు ఆదిలక్ష్మి, శ్రీకాంత్, బ్రహ్మనాయుడు, పోలీసు సిబ్బందితో కలిసి నాయుడుపేట పట్టణం ఎన్ఎస్ఆర్ కాలనీలో కార్డన్ సెర్చ్ చేపట్టారు. కాలనీలో అనుమానిత వ్యక్తులు, గంజాయి, మద్యం విక్రయాలపై ఆరా తీశారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాలనీలో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న సర్వజ్ఞ కుమార యాచేంద్ర, మస్తాన్‌యాదవ్

వెంకటగిరి (సైదాపురం) : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని వెంకటగిరి రాజా కుటుంబ సభ్యుడు సర్వజ్ఞ కుమార యాచేంద్ర తెలిపారు. ఆయన ఆదివారం ప్రముఖ వైద్యులు డాక్టర్ మస్తాన్ యాదవ్‌తో కలిసి వెంకటగిరి పట్టణం తారాకరామా క్రీడా ప్రాంగణంలో మార్పు సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. మొక్కలు నాటి నీరు పోశారు. ఆయన మాట్లాడుతూ మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. మార్పు సంస్థ మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ బీకే ప్రసాద్, కౌన్సిలర్ ఎంఏ నారాయణ, చిగురుపాటి లావణ్య, జలగం కామాక్షి, ఆవుల వెంకటేశ్వర్లు, ధనుంజయ్, సుకుమార్, తేజ, హరి, కిరణ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో చెక్‌డ్యామ్



కుప్పారెడ్డిపాళెం సమీపంలో దెబ్బతిన్న చెక్ డ్యామ్

దొరవారిసత్రం : కుప్పారెడ్డిపాళెం గ్రామ సమీపంలో ఉన్న పాలకాలువపై నిర్మించిన చెక్ డ్యామ్ శిథిలావస్థకు చేరింది. దీంతో వర్షపు నీరు వృథాగా పోతోంది. ఈ చెక్ డ్యామ్‌ను 30 ఏళ్ల క్రితం నిర్మించారు. రెండు వైపులా నిర్మించిన రివిట్‌మెంట్ పూర్తిగా దెబ్బతింది. పిచ్చిమొక్కలు, ముళ్ల చెట్లు భారీగా పెరిగిపోయి చెక్ డ్యామ్ పూర్తిగా దెబ్బతినింది. చెక్ డ్యామ్‌లో నీరు నిలివడం వల్ల చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ బోర్లలో నీరు పుష్కలంగా ఉంటుందని, సుమారు 20 ఎకరాల వరకు పంటలకు నీరు సరిపోయేదని రైతులు చెబుతున్నారు. చెక్ డ్యామ్‌ను బాగు చేయాలని పలుమార్లు ఇరిగేషన్ శాఖ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వేరు చేస్తున్న రైతులు

చిల్లకూరు : తీర ప్రాంతంలోని గ్రామాలకు చెందిన మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్నట్టు క్రిష్ణపట్నం పార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన ఆదివారం తమ్మినపట్నం గ్రామంలో కేఎఫ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ నేడు ఆర్గానిక్ ఆహారంపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి లాభాలు ఎలా పొందాలనే విషయాలపై అవగాహన కల్పించడంతోపాటు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. అదానీ ఫౌండేషన్ ప్రతినిధి రాకేష్‌రంజన్, షఫీ, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్ బోల్తా

పెళ్లకూరు: మండలంలోని నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారిలో గుర్రప్పతోట వద్ద ఆదివారం ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడింది. డ్రైవర్ తిరుపతయ్యకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. ఆయిల్ ట్యాంకర్ విజయవాడ నుంచి బెంగుళూరు బయలుదేరింది. గుర్రప్పతోట గ్రామం వద్ద ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దీంతో ట్యాంకర్‌లోని ఆయిల్ నేలపాలైంది. గాయపడిన డ్రైవర్ తిరుపతయ్యను స్థానికులు నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

టిడ్కో ఇళ్లకు మోక్షమెన్నడో..?

పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తున్నట్టు 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. పలుచోట్ల టిడ్కో ఇళ్ల పేరుతో అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపట్టింది. లబ్ధిదారుల వాటా కింద రూ.50 వేలు వసూలు చేసింది. పనులు పూర్తిచేయడంపై దృష్టిసారించలేదు. 2019లో ఎన్నికలకు ముందు లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ చేసినట్టు ప్రకటించి చేతులు దులుపుకుంది. 2024లో అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించలేదు. దీంతో వారు ఆశగా ఎదురుచూస్తున్నారు.

- ఆరేళ్లు దాటినా పూర్తికాని ఇళ్లు
- లబ్ధిదారుల పేరుతో బ్యాంకుల నుంచి రుణాలు
- ఇళ్ల కోసం ఎదురు చూస్తున్న పేదలు



సూళ్లూరుపేట పట్టణానికి ఆరు కిలోమీటర్లు దూరంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల సముదాయం

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట మున్సిపాలిటిలోని నిరుపేదలకు టిడ్కో కింద ఇళ్లు కట్టిస్తామని 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రకటించింది. పట్టణానికి ఆరు కిలో మీటర్లు దూరంలోని సూళ్లూరుపేట–శ్రీకాళహస్తి రోడ్డుకు పక్కన అటవీప్రాంతంలో 1824 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఒక్కో బ్లాక్‌లో 48 ఇళ్ల లెక్కన 38 బ్లాక్‌లు నిర్మించాల్సి వుంది. కాంట్రాక్టర్లపై పర్యవేక్షణ లేకపోవడం, నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు నత్తనడకన సాగాయి. ఆరు బ్లాకుల్లో అరకొరగా పనులు పూర్తయ్యాయి. ఈ క్రమంలోనే 2019లో ఎన్నికలు రావడంతో ఆ కాలనీలో మౌలిక సదుపాయాలు, కల్పించకుండానే, ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకుండానే 1399 మంది లబ్ధిదారులకు నాటి మున్సిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణ ఇళ్లు పంపిణీ చేసి మమా అనిపించారు.

1389 మందికి బ్యాంకుల్లో రుణాలు

ఇందులో 1389 మంది ఇళ్లకు సంబంధించి సూళ్లూరుపేటలో వున్న 11 బ్యాంకుల నుంచి రుణం ఇప్పించారు. ఒక్కో బ్యాంకుకు 127 ఇళ్లు లెక్కన కేటాయించారు. ఈ లెక్కన ఒక్కో బ్యాంకు రూ.4 కోట్లు లెక్కన రుణాలిచ్చింది. 1824 ఇళ్లలో 1389 మందికి ముందుగా ఇళ్లు ఇచ్చేసినట్టు మున్సిపాలిటీ అధికారులు 2019 ఎన్నికలకు ముందే ప్రకటించారు. మిగిలిన 425 మందికి ఇప్పటికీ ఇవ్వలేదు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయినా ఇళ్ల గురించి పట్టించుకోకపోవడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి టిడ్కో ఇళ్లను తమకు పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

మూడు భాగాలుగా ఇళ్ల నిర్మాణం

టిడ్కో ఇళ్లను మూడు భాగాలుగా విభజించారు. కేటగిరి–1లో 300 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఇంటిని రూ.7.65 లక్షలతో నిర్మిస్తామని చెప్పారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.3.50 లక్షలు, లబ్ధిదారుని వాటా రూ.500లు. బ్యాంకు రుణం రూ.2.65 లక్షలు. కేటగిరి–2 లో 365 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటిని రూ.9.40 లక్షలతో నిర్మిస్తామన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.4.25 లక్షలు, లబ్ధిదారుని వాటా రూ.50 వేలు, బ్యాంకు రుణం రూ.3.15 లక్షలు. కేటగిరి–3లో 430 చదరపు అడుగుల విస్తీర్ణం ఇంటిని రూ.11.15 లక్షలతో నిర్మిస్తామని పేర్కొన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.5 లక్షలు, లబ్ధిదారుని వాటా రూ.లక్ష, బ్యాంకు రుణం రూ.3.65 లక్షలు.

మౌలిక వసతులు కల్పించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అదే సమయంలో కరోనా మహమ్మారి రావడంతో మూడేళ్లు ఎక్కడా ఎలాంటి పనులు జరగలేదు. తర్వాత అసంపూర్తిగా వున్న టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం పూర్తి చేసింది. కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, కరెంట్, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించింది. ఈ నేపథ్యంలో 2024లో ఎన్నికలు షెడ్యూలు రావడంతో లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ కార్యక్రమం ఆగిపోయింది.



అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లు

ఎన్‌సీసీతో యువతలో దేశభక్తి



ఎన్‌సీసీ క్యాడెట్లకు ఫైరింగ్‌లో శిక్షణ ఇస్తున్న అధికారులు

కోట: ఎన్‌సీసీలో చేరడం వల్ల యువతలో దేశభక్తి పెంపొందుతుందని ఎన్‌సీసీ క్యాడెట్లకు క్యాంపు కమాండెంట్ గణేష్ గొడంగవే తెలిపారు. విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఎన్‌సీసీ నావల్ యూనిట్ వార్షిక శిక్షణా శిబిరం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆదివారం ఎన్‌సీసీ క్యాడెట్లకు ఇన్‌స్ట్రక్టర్లు, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్లు శారీరక దృఢత్వంపై శిక్షణ ఇచ్చారు. ఆలిండియా నౌకా సైనిక్ క్యాంపు కోసం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నావల్ క్విజ్, సముద్ర నావిగేషన్‌పై అవగాహన కల్పించారు. రైఫిల్ షూటింగ్, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్లు మల్లికార్జున్‌రెడ్డి, పెంచల్‌రెడ్డి పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

నాలుగో రోజుకు చేరిన కార్మికుల దీక్ష

- మోకాళ్లపై నిలబడి కార్మికుల నిరసన
- శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి మున్సిపాలిటీలో పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును సస్పెండ్ చేయాలని పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేశారు. వారు సీఐటీయూ ఆధ్వర్యంలో చేస్తున్న దీక్ష ఆదివారానికి నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధం) తిరుపతి జిల్లా అధ్యక్షుడు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏళ్ల తరబడి వెంకటగిరి మున్సిపాలిటీలో తిష్ట వేసి కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అతన్ని వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు, సీఐటీయూ వెంకటగిరి మండల అధ్యక్షులు ఏ మంజుల, యూనియన్ జిల్లా జాయింట్ సెక్రటరీ వి పెంచలయ్య, సుబ్బయ్య, ఎస్ ప్రసాద్, పి సుబ్రమణ్యం, పి రమణయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన సదస్సు



సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పిస్తున్న ఈఈ శ్రీనివాసులు, డీఈ వరప్రసాద్ రెడ్డి, ఏఈలు

నాయుడుపేట టౌన్ : సోలార్ విద్యుత్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ శ్రీనివాసులు తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని ఏఎల్‌సీఎం గ్రౌండ్‌లో ఆదివారం విద్యుత్ శాఖ సారధ్యంలో సోలార్ విద్యుత్‌పై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద రాయితీతో సోలార్ విద్యుత్ పరికరాలను అందజేస్తోందన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ ఇంటిపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటుచేసుకుని విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చన్నారు. తద్వారా కరెంటు బిల్లు తగ్గుతుందని, మిగిలిన కరెంట్‌ను విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చని చెప్పారు. ప్యానళ్లు తదితరాలకు అయ్యే ఖర్చును బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పలువురితో సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ చేయించారు. కార్యక్రమంలో డీఈ వరప్రసాద్ రెడ్డి, నాయుడుపేట, ఓజిలి, పెళ్లకూరు తదితర మండలాల ఏఈలు పాల్గొన్నారు.

పేదలకు సరుకులు అందజేత

చిల్లకూరు: గూడూరులోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గున్నం సేవా ట్రస్టు అధినేత మధుసూదన్‌రెడ్డి 25 మంది పేదలకు నెలకు సరిపడా సరుకులు అందజేశారు. ఆయనను సంఘం అధ్యక్షుడు సనత్‌కుమార్‌రెడ్డి అభినందించారు. సంఘం ప్రతినిధి ప్రజేంద్రరెడ్డి, మండి శ్రీనివాసులురెడ్డి, ఎరమాక క్రిష్ణారెడ్డి, వాసిరెడ్డి హరిక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.


కండలేరులో 35.230 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 35.230 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,440, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

తల్లికి వందనం అందరికీ ఇవ్వాలి

చిల్లకూరు : అర్హులందరికీ తల్లికి వందనం పథకాన్ని అందేలా చూడాలని సీపీఎం నాయకులు కోరారు. వారు ఆదివారం గూడూరు పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య, జక్కా వెంకయ్య, శ్రామిక్ నగర్ ప్రాంతాల్లో నివసించే పేదల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లికి వందనం అందని వారిని గుర్తించారు. వారు మాట్లాడుతూ పథకం అందని వారి జాబితాను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. అలాగే దరఖాస్తులను సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా గూడూరు సబ్ కలెక్టర్‌కు అందజేసేలా చూస్తామని వివరించారు. కార్యక్రమంలో నాయకులు జోగి శివకుమార్, పుట్టా శంకరయ్య, బీవీ రమణయ్య, పామంజి మణి పాల్గొన్నారు.

జీఎన్‌టీ రోడ్డులో కూలిన చెట్టు



చెట్టును తొలగిస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని పాత బస్టాండు సమీపంలో జీఎన్‌టీ రోడ్డు పక్కన వున్న పెద్ద చెట్టు ఆదివారం సాయంత్రం విరిగిపడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ ఫేక్ ఫజులుల్లా సిబ్బందితో అక్కడికి చేరుకుని జేసీబీతో చెట్టును పక్కకు తొలగించారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నూతన కమిటీలు

దొరవారిసత్రం : మండలంలోని బురదమడుగులో ఆదివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల నూతన గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ఆ సంఘం తిరుపతి జిల్లా ఇన్‌చార్జి దేవదాసు మాదిగ మాట్లాడుతూ జూలై 7 నుంచి 31వ తేదీ వరకు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. బురదమడుగు పరిధిలోని ఎస్సీ కాలనీ ప్రాంతంలో చెరువు కట్టను కొందరు ఆక్రమించుకుని ధ్వంసం చేశారని తెలిపారు. దీంతో భారీ వర్షాలు కురిసిన సమయంలో కాలనీ వరద ముంపునకు గురవుతుందని వాపోయారు. అధికారులు స్పందించి కట్టను బాగు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నాగేశ్వరావుమాదిగ, శివయ్యమాదిగ, రవి, చెంగమ్మ, రఘు, సుబ్రమణ్యం, స్థానికులు పాల్గొన్నారు.

మల్లాంలో విశేష పూజలు

చిట్టమూరు : మండలంలోని మల్లాంలో స్వయంభువుగా వెలసిన వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివా రం విశేష పూజలు చేశారు. కృత్తిక సందర్భంగా ఉదయం స్వామి వారికి విశేష పూజలు చేశారు. కుజదోషం ఉన్న వారు హోమాలు చేయించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి పల్లకీ సేవ, గ్రామోత్సవం నిర్వహించారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో..

నాయుడుపేట టౌన్: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో వున్న వళ్లీ దేవసేన సమేత షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కృత్తిక నక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్లకు క్షీరాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించారు. ఆలయ వ్యవస్థాప ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ, సుబ్రహ్మణ్యం పీఠం సభ్యులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో..

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. మహిళలు సంతానం కోసం రావిచెట్టు, త్రిశూలం వద్ద వరపడ్డారు. భక్తుల రద్దీతో క్యూలు నిండిపోయాయి. భక్తులకు ఆలయ సిబ్బంది వాటర్ ప్యాకెట్లు అందజేశారు. ఈవో నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

అంకాళ పరమేశ్వరి ఆలయంలో..

రాపూరు: మండలంలోని వేపినాపి సమీపంలో పోతుకొండలో కొలువైన అంకాళ పరమేశ్వరికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఉదయం అభిషేకం, పూలంగి సేవ చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తలనీలాలు సమర్పించారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

తెగిపడిన విద్యుత్ తీగలు

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరిలో ఆదివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. పెనుగాలులు వీయడంతో గుంటకట్ట, పాలకేంద్రం ప్రాంతాల్లో 11 కేవీ విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం జరగలేదు. చింతగుంట ప్రాంతంలో చెట్లు నెలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ అధికారులు పునరుద్ధరణ పనులు చేపట్టారు.

నేడు నెల్లూరులో యువత పోరు

నాయుడుపేట టౌన్/సైదాపురం/చిట్టమూరు : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, నిరుగ్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ విడుదల తదితర హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు సోమవారం నెల్లూరులో యువత పోరు నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం వెంకటగిరి, నాయుడుపేట పట్టణాల కన్వీనర్లు శ్రీనివాసులు రాజు, పాలేటి నాగార్జున, గూడూరు నియోజకవర్గ యువత అధ్యక్షుడు మాచిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. వారు ఆదివారం వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయినా హామీలు నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేసిందని ఆరోపించారు. ముఖ్యంగా యువతకు పలు హామీ ఇచ్చినట్టు గుర్తు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఏడాదికి 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, లేనిపక్షంలో రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారని తెలిపారు. ఇప్పటి వరకు ఉద్యోగాల కల్పన లేదని, నిరుద్యోగ భృతి ఊసేలేదన్నారు. జాబ్ క్యాలెండర్ గురించి పట్టించుకోలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో యువతను ఆదుకోవాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించి నెల్లూరులో కార్యక్రమం వుంటుందని తెలిపారు. వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల నుంచి నిరుద్యోగులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన





దొరవారిసత్రం: కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు, పెళ్లకూరు: కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్

దొరవారిసత్రం : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కోగిలి జయరామిరెడ్డి సేవా సంస్థ సహకారంతో తిరుపతికి చెందిన శ్రీవెంకటేశ్వర అరవింద కంటి ఆస్పత్రి వైద్యులు రోగులకు కంటి పరీక్షలు చేశారు. సుమారు 150 మంది రోగులు వైద్య పరీక్షలు చేసుకున్నారు. 58 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్టు నిర్వాహకులు కృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు సురేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.


పెళ్లకూరులో..

పెళ్లకూరు: మండల కేంద్రమైన పెళ్లకూరులోని చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్టు ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతికి చెందిన వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ వైద్యులు రోగులకు కంటి పరీక్షలు చేశారు. 210 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. 80 మందికి మందులు, కంటి అద్దాలు అందజేశారు. 50 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ట్రస్టు సీఈవో సీతారామయ్య, ఏవో కృష్ణ, డాక్టర్ కీర్తి, డాక్టర్ నీలిమ పాల్గొన్నారు.

10 మందికి జరిమానా

నాయుడుపేట టౌన్ : మద్యం తాగి వాహనాలు నడిపిన 10 మందికి రూ.10 వేల చొప్పున కోర్టు జరిమానా విధించినట్టు సీఐ బాబి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఐ ఆదిలక్ష్మి తమ సిబ్బందితో కలిసి నాయుడుపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 10 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు. ఈ క్రమంలో న్యాయమూర్తి మీనాక్షి సుందరం ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్టు పేర్కొన్నారు. రెండోసారి మద్యం తాగి పట్టుబడితే రూ.10 వేలతో పాటు జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

శాఖాహారంతో ఆరోగ్యం



శాఖాహారంపై అవగాహన ర్యాలీ

చిల్లకూరు: శాఖాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని బుద్ధా పిరమిడ్ ధ్యాన ఆశ్రమ సభ్యులు తెలిపారు. గూడూరు పట్టణంలో ఆదివారం శాఖాహారంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతి జీవికి జీవించే హక్కు ఉందని తెలిపారు. మనిషి జీవులను చంపి వాటి మాంసం తినడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. చరిత్రంలో ఎంతో మంది రుషులు, ఆధ్యాత్మికవేత్తలు శాఖాహారం తిని వందల ఏళ్లు జీవించారని గుర్తు చేశారు. వారిని ఆదర్శంగా తీసుకుని శాఖాహారం తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతినిధులు నాగమణి, దేవరాజు, దర్గ, పోలమ్మ పాల్గొన్నారు.

ఆగని తెల్లరాయి తవ్వకాలు

- కరిగిపోతున్న గనులు
- పట్టించుకోని అధికారులు



అనుమతులు లేకుండానే తవ్విన తెల్లరాయి

కలువాయి(సైదాపురం): కలువాయి మండలం కోటూరుపల్లిలో తెల్లరాయి గనులు ఎక్కువగా వున్నాయి. తెల్లరాయికి విదేశాల్లో గిరాకీ ఎక్కువగా వుంది. దీంతో కూటమి నేతలు అనుమతులు లేకపోయినా ఇష్టానుసారంగా తవ్వకాలు చేస్తున్నారు. టిప్పర్ల ద్వారా రాత్రికి రాత్రే ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నారు. దీంతో గనులు కరిగిపోతున్నాయని, ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోందని స్థానికులు వాపోతున్నారు. తెల్లరాయి అక్రమ రవాణా విషయం తెలిసినా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ దందా వెనుక వెంకటరెడ్డిపల్లి, కోటూరుపల్లికి చెందిన నేతలు ఉన్నట్టు విమర్శలు వున్నాయి. ఈ ప్రాంతంలో తవ్విన ఖనిజాన్ని సైదాపురం తరలిస్తారు. అక్కడి నుంచి విదేశాలకు పంపుతున్నట్టు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు తీసుకుని సహజ వనరులను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అక్రమ మైనింగ్ చేస్తున్న దృశ్యం